epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel

సంపుటి : 01 | సంచిక : 149 | మంగళవారం | 05.11.2024




జనగామలోని నెహ్రూ పార్క్ వద్ద ఉన్న
ఎస్‌బీఐ బ్యాంక్ ముందు రోడ్డు నిలిపిన వాహనాలు







జనగామలోని
యూనియన్ బ్యాంక్ వద్ద వాహనాలు

## రోడ్లపైనే వాహనాలు

# నిలుప వలెను!

'రోడ్లపైనే వాహనాలు నిలుప వలెను..' ఏంటీ కొటేషన్ చదవగానే.. కన్ఫ్యూజ్ అవుతున్నారా..! మీరు కరెక్టే చదివారు..! కావాలంటే పై ఫొటోలు చూస్తే మీరు చదివిన కొటేషన్ కరెక్టే అని పిస్తుంది.. మీరు చూసిన ఫొటో పట్టణంలోని నెహ్రూ పార్క్ వద్ద ఉన్న ఎస్‌బీఐ బ్యాంక్.. ఇదే కాదు జిల్లా కేంద్రంలో దాదాపు తప్ప అన్ని బ్యాంకుల వద్ద నిత్యం ఇదే పరిస్థితి ఉంటుంది. బ్యాంకు వద్ద పార్కింగ్ స్థలాలులేక ఖాతాదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఎంత ఆన్‌లైన్ పేమెంట్లు ఉన్నా.. జిల్లాలోని వ్యాపారస్తులు, వివిధ శాఖ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు నిత్యం బ్యాంకులకు వచ్చి లావాదేవీలు చేస్తుంటారు. అయితే బ్యాంకులోకి వచ్చి పని చేసుకోవడం తమకు పెద్ద టాస్కే అంటున్నారు ఖాతాదారులు. బ్యాంకుల వద్ద పార్కింగ్ ప్లేసు లేకపోవడంతో రోడ్డుపై వాహనాలు నిలిపి వెళ్లాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. తాము ఇలా వెళ్లగానే ట్రాఫిక్ పోలీసులు వచ్చి బండ్లను ఫొటోలో తీసి ఫైన్లు వేస్తున్నారని మరికొందరు వాపోయారు. తమకు సేవలందించేందుకు వివిధ చార్జీలు వేస్తున్న బ్యాంకు అధికారులు ఖాతాధారులకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

- మన చౌరాస్తా, జనగామ

General News



# కొన్న ధాన్యాన్ని అదే రోజు తరలించాలి

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** కొనుగోలు కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని అదే రోజు మిల్లులకు తరలించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులకు సూచించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు రవాణా చేపట్టి తరలించాలన్నారు. దొడ్డు రకం, సన్నరకం ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం వస్తేనే కొనుగోలు చేస్తున్నామని నిర్వాహకులు కలెక్టర్ కు వివరించారు. సన్న రకం దొడ్డు రకం విక్రయాలను వేరువేరుగా చేపట్టాలని నిర్వాహకులకు చెప్పారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నట్లు రైతులకు కలెక్టర్ తెలిపారు. ట్యాబ్ ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రాల్లోలో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో డిఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

### స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

జిల్లాలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కొరకు భూసేకరణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో కలెక్టర్ రిజ్వాన్ బాషా జాఫర్‌గడ్ మండలంలో కోనాయచలం గ్రామం వద్ద ఇంటిగ్రేట్ స్కూల్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అనువుగా ఉన్న స్థలాన్ని పరిశీలిస్తూ ఈ స్థలంపై ఎటువంటి అభ్యంతరాలు ఉండకూడదని, సర్వే నంబర్ల వారీగా నివేదిక త్వరితగతిన అందజేయాలన్నారు.



# ఇందిరమ్మ కమిటీల జోక్యం లేకుండా

# ఇండ్ల జాబితా రెడీ చేయాలి

## – ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం

**జనగామ, మన చౌరాస్తా :** ఇందిరమ్మ కమిటీల జోక్యం లేకుండా ఇండ్ల జాబితా రెడీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం కోరారు. ఈ మేరకు అడవికేశ్వపుర్ సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇల్లు లేని పేదలకు ఇండ్లు నిర్మించాలని స్థానిక ఎమ్మార్వో హుస్సేన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధర్మ భిక్షం మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీల ద్వారా పేదలకు ఇండ్ల నిర్మాణంలో సరైన న్యాయం జరగదన్నారు. ఇందిరమ్మ కమిటీల నియామకంపై ఎలాంటి గైడ్ లైన్స్ లేవన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు ఇండ్లు ఇప్పిస్తామని అబద్ధపు ప్రచారాలు చేస్తూ డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులే స్వయంగా గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ నాయకులు ఉత్కూరీ సారయ్య , నాంపల్లి బన్నీ, దండు ఎల్లయ్య ఉత్కం ఆంజనేయులు పాల్గొన్నారు.






## మాజీ సర్పంచుల

# అరెస్టు సరికాదు

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి , మన చౌరాస్తా : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ పోరుబాటకు పిలుపునిచ్చిన మాజీ సర్పంచ్ లను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బంగారు తెలంగాణ ధ్యేయంగా పల్లెలు బాగుండాలని కేసీఆర్ పల్లెప్రగతి, ప్రకృతి వనం, రైతు వేదిక లు అనే కార్యక్రమాలు మొదలు పెట్టినపుడు, అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములు కావాలని ముందు పడి ప్రతీ గ్రామ పంచాయతీని అభివృద్ధి బాటలో పెట్టిన సర్పంచ్ లను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు గడిచినా చిన్న చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా వారిని అరెస్టులు చేసి వారిని భయభ్రాంతులకు గురించేయడం ఎంతవరకు న్యాయం అని ప్రశ్నించారు. మాజీ సర్పంచులను ప్రభుత్వం అరెస్టు చేయడం ముమ్మాటికి సిగ్గుమాలిన చర్య అని అన్నారు. ముఖ్యమంత్రి ని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్ కు వస్తే వారిని అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమని తెలిపారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన సర్పంచులను అరెస్టులు చేయడమేనా అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచులకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని అన్నారు. అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేసిన మాజీ సర్పంచులు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు.



# శ్రీనివాస నగర్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక

జనగామ టౌన్, మన చౌరాస్తా : జనగామ పట్టణ సమీపంలోని నెల్లుట్ల గ్రామ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా గంగరాజు శ్రీనివాస రావు, అధ్యక్షుడిగా చెట్టిపల్లి నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పాశం శ్రీనివాస్, కోశాధికారిగా గట్టు వెంకట శేషగిరి, ఉపాధ్యక్షులుగా చిర్ర హేమలత, సహాయ కార్యదర్శిగా ఎస్‌డీ యూసుఫ్, కార్యవర్గ సభ్యులుగా దోర్నాల సురేందర్, మాచర్ల నరేశ్, కూటికంటి పుష్పలత, అద్దంకి అలివేలు మంగ, గర్వందుల నవీన్ ఎన్నికయ్యారు.

Local News



## చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధించి తీరుతాం

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల రెవిన్యూ డివిజన్ సాధించి తీరుతామని ఈ నెల 30న సంకల్ప దీక్ష నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ తెలిపారు. సోమవారం చేర్యాల మండల కేంద్రంలో సిద్దిపేట రోడ్డుకు జేఏసీ కార్యాలయాన్ని వివిధ ప్రజా సంఘాలు కుల సంఘాలతో కలిపి ప్రారంభించి తెలంగాణ ఉద్యమ పితామహుడు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ మాట్లాడుతూ చేర్యాల రెవిన్యూ డివిజన్ ఆవశ్యకతను సభ్యులందరికీ వివరించి భవిషత్ ప్రణాళి కలపై సభ్యుల నుండి వివిధ సలహాలు సూచనలు తీసుకున్నారు. ఉద్యమ కార్య చరణ పై పలు అంశాలపై తీర్మానాలు చేశారు ఈ నెల రెండో వారంలో ప్రభుత్వ పెద్దలకు ఉమ్మడి వరంగల్ ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సిద్దిపేట జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొండ సురేఖకు అధికార పార్టీ అధ్యక్షులు కే మహేష్ గౌడ్ ల దృష్టికి తీసుకువెళ్లి రెవిన్యూ డివిజన్ ప్రకటించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పిస్తామని ఈ ప్రాంత ఆవశ్యకతను వారికి వివరిస్తామని తెలిపారు. ఈనెల 1000 మందితో అంగడి బజార్ లోని అంబేద్కర్ సర్కిల్ ముందు సంకల్ప దీక్ష చేయుటకు నిర్ణయం తీసుకున్నారు. ఈ దీక్ష కార్యక్రమంలో జేఏసీ బాలస్వామి పక్షాలైన రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజా సంఘాల నాయకులు కుల సంఘాలు రాష్ట్ర నాయకులు పాల్గొంటారని అ న్నారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి చేర్యాల ప్రాంత ప్రజలు ఉద్యమంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పురుమ ఆగం రెడ్డి, కామెడీ జీవన్ రెడ్డి, తోకల ఉమారాణి, అంకుగారి శశిధర్ రెడ్డి, అంది అశోక్, అందె బీరయ్య, మల్లి గారి యాదయ్య, దాసరి శ్రీకాంత్,ఆడెపు నరేందర్, గద్దల మహేందర్, పందిళ్ళ నరసయ్య, మేక మల్లేశం, పాల లక్ష్మీనారాయణ, తడక లింగమూర్తి బుట్టి బిక్షపతి జంగిల్ యాదగిరి మన్నె సత్య వర్ధన్ గోపు ఆరోగ్యం రెడ్డి, పుష్కరాందాస్, పిల్లి చంద్రం, రామగల నరేష్ బండి శ్రీనివాస్ గౌడ్ పోతుగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం వడ్డిచర్ల పరిధిలోని చౌప్పం చెరువును కబ్జా చేసి గ్రీన్ సిటీ పేరుతో అక్రమ లేఅవుట్లతో ప్లాట్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బోయిని రాజు కోరారు. ఈ మేరకు సోమవారం జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు అధికారులను తప్పుతోవ పట్టించి, బెదిరింపులకు పాల్పడి చౌప్పం చెరువు సగానికి పైగా కబ్జా చేసి లేఅవుట్ చేసి ప్లాట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. చెరువు కబ్జాపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చెరువు రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యం మరో మారు కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించినట్టు చెప్పారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజుతో పాటు నవాబుపేట గ్రామస్తులు ఉన్నారు.

## నిబంధనలు పాటించని 'ఆదర్శ పాఠశాల'

**జనగామ, మన చౌరాస్తా :** నిబంధలకు వ్యతిరేకంగా నడుస్తున్న ఆదర్శ హైస్కూల్‌పై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాకు గ్రీవెన్స్‌లో తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆదర్శ హైస్కూల్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా, షిఫ్టింగ్ ఆర్డర్ లేకుండా రేకుల షెడ్డులో విద్యార్థులకు విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. బస్సులో కనీసం సెక్యూరిటీ గార్డ్ లేకుండా ఓవర్ లోడ్ తో విద్యార్థులను తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి వెంటనే ఈ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీజీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిట్టల సురేష్, జిల్లా అధ్యక్షుడు గన్ను కార్తీక్, జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ కౌశిక్, పట్టణ అధ్యక్షుడు వెంపటి అజయ్, నాయకులు కాగితాల అజయ్ తదితరులు పాల్గొన్నారు.





## సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం ప్రజా పోరాటాలు

**జనగామ, మన చౌరాస్తా :** సీపీఎం రెండో వార్డ్ మహాసభ రెండో వార్డులోని బెత్లహేములో సోమవారం జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా జనగామ పట్టణ కార్యదర్శి కామ్రేడ్ మోకు కనకారెడ్డి జెండా ఆవిష్కరణ చేయగా అనంతరం జరిగిన మహాసభకు మోడీ రాములు అధ్యక్షత వహించగా జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ పాల్గొని మాట్లాడారు. మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టాక దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోయిందన్నారు. ప్రజల మధ్య మత విద్వేశాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశం అప్పులు రూ.160 లక్షల కోట్లకు చేరిందన్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆరు గ్యారెంటీలు ప్రకటించినా వాటి అమలులో విఫలమైందన్నారు. మహాసభలో పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, పోతులూరి కనకాచారి, ఏనుగుల కమల, ఎలీషా, పాల్, శాంతి, లక్ష్మి, జానకి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



## సోమేశ్వర ఆలయంలో లక్ష దీపోత్సవం

**పాలకుర్తి , మన చౌరాస్తా :** శ్రీ సోమేశ్వర లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా మొదటి సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సోమేశ్వర స్వామికి అభిషేకాలు అర్చన నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం లక్ష దీపోత్సవం కార్యక్రమంలో మహిళలు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి మొక్కలు చెల్లించుకున్నారు. లక్ష దీపోత్సవంలో పాల్గొన్న పాల్గొన్న మహిళలకు ప్రమిదలు నూనె, ఒత్తులు, పసుపు కుంకుమ, గాజులు జాకెట్ ముక్క, పండ్లు తాంబూలం, స్వామివారి ప్రసాదం వాయినంగా అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సల్వాది మోహన్ బాబు. ఆలయ అర్చకులు డివిఆర్ శర్మ, అనిల్ కుమార్, మత్తగజం నాగరాజు, ఆలయ సూపర్డెంట్, కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.





# అడవుల బాట పట్టిన సమంత

**మన చౌరాస్తా, సినిమా :** ప్రొఫెషనల్ లైఫ్‌లో బిజీగా ఉండటం కెరీర్‌కు ఎంత కీలకమో.. పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేయడం కూడా అంతే ముఖ్యం. ఈ రెండింటిని బ్యాలెన్స్ చేయడం తెలియక చాలా మంది తెగ కష్టపడుతుంటారు. కానీ తను అలా కాదంటున్నారు సమంత. ఇటు పర్సనల్ లైఫ్ ఎంజాయ్ చేస్తూనే.. అటు ప్రొఫెషనల్‌గానూ రఫ్ ఆడిస్తుంది స్యామ్. ఆ మధ్య మయోసైటిస్ కారణంగా లాంగ్ బ్రేక్ తీసుకున్న స్యామ్.. ఇప్పుడా బాకీ అంతా తీర్చేస్తున్నారు. తెలుగులో కాదు కానీ హిందీలో మాత్రం చాలా బిజీ అయ్యారు ఈ బ్యూటీ. నవంబర్ 7 నుంచి ఈమె నటిస్తున్న సిటాడెల్ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ బిజీలో ఉంటూనే.. పర్సనల్ లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు సమంత. బిజీ షెడ్యూల్స్ మధ్యలో రిలీఫ్ కోసం రాజస్థాన్‌లోని రణతంబోర్ అడవికి వెళ్లారు సమంత. సోషల్ మీడియాలో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. పులులు తిరిగే చోట సాహస యాత్ర చేస్తున్నారు స్యామ్. అడవి జంతువులతో పాటు ప్రకృతిలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదిస్తున్నానంటూ ఇన్‌స్టాలో రాసుకొచ్చారు ఈ భామ. అక్కడి ముచ్చట్ల గురించి స్టోరీ పోస్ట్ చేశారు. సమంత ప్రస్తుతం సినిమాలేం చేయట్లేదు కానీ వెబ్ సిరీస్‌లు మాత్రం బాగానే చేస్తున్నారు. ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్ తర్వాత రాజ్ డికే దర్శకత్వంలోనే రక్త్ బ్రహ్మాండ్ అనే సిరీస్‌కు ఓకే చెప్పారు స్యామ్. త్వరలోనే షూట్ మొదలు కానుంది. ఈ గ్యాప్‌లోనే అడవి బాట బట్టారు సమంత. అక్కడే హాయిగా ప్రకృతిని ఎంజాయ్ చేస్తున్నారు.